
సాక్షి
పల్నాడు
సోమవారం | 27 | జనవరి | 2025



గాయత్రీ దీప మహాయజ్ఞం

బొన్నూరు: సాక్షి భావన్నారాయణస్వామి దేవస్థానం ప్రాంగణంలో అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం గాయత్రీ దీప మహా యజ్ఞం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 555.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,567 క్యూసెక్కులు వదిలారు.



కలశాలతో శోభాయాత్ర

పిడుగురాళ్ల: ప్రసన్నాంజనేయస్వామి వారి మూల విరాట్‌కు ఆదివారం అభిషేకం చేశారు. మహిళా భక్తులు కలశాలతో శోభా యాత్ర నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఐజీ కార్యాలయంలో జెండా వందనం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని గుంటూరు రేంజ్ ఐజీ కార్యాలయ ఆవరణలో ఆదివారం గణతంత్ర దినోత్సవం జరిగింది. జాతీయ జెండాను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఎగురవేశారు. గుంటూరు ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, సీసీ.రాఘవ, సీఐ ఆరోగ్యరాజు, ఐజీ, జిల్లా ఎస్పీ కార్యాలయాల ఉద్యోగ, సిబ్బంది పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో..



నరసరావుపేట: రాజ్యాంగం అమలుతో కీలకమైన సంపూర్ణ గణతంత్ర రాజ్యంగా దేశం అవతరించిందని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు క్యాంప్ ఆఫీస్, జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ చేశారు. జిల్లా అదనపు ఎస్పీలు జేవీ సంతోష్, సీహెచ్ లక్ష్మీపతి, సత్తిరాజు పాల్గొన్నారు.


పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నంబూరులో తాత్కాలిక హాల్టింగ్

రైల్వేస్టేషన్(విజయవాడ సెంట్రల్): గుంటూరులోని కాజాలో జరుగుతున్న బైబిల్ మిషన్ సదస్సుకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నంబూరు స్టేషన్‌లో రెండు నిమిషాల పాటు తాత్కాలింగా హాల్టింగ్ సదుపాయం కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 26 నుంచి 29 వరకు నర్సాపూర్-గుంటూరు ఎక్స్‌ప్రెస్ (17281), సికింద్రాబాద్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్ (17015) రైళ్లు నంబూరు స్టేషన్‌లో ఆగనున్నాయి. బైబిల్ మిషన్ వార్షిక సదస్సు కోసం వేలదిగా తరలివచ్చే ప్రయాణికుల సౌకర్యం కోసం దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ కాకినాడ టౌన్-గుంటూరు మధ్య ప్రత్యేక అన్ రిజర్వ్‌డ్ రైలును (ప్యాసింజర్) నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కాకినాడ టౌన్-గుంటూరు ప్రత్యేక రైలు (07223) ఈ నెల 26న ఉదయం 5.30 గంటలకు కాకినాడ టౌన్‌లో బయలుదేరి, అదే రోజు మధ్యాహ్నం 12.50 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07224) ఈ నెల 29న మధ్యాహ్నం 1.30 గంటలకు గుంటూరులో బయలుదేరి, అదే రోజు రాత్రి 8.40 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. వయా నిడదవోలు, ఏలూరు మీదుగా నడిచే ఈ రైలుకు అన్ని స్టేషన్లలో ఒక నిమిషం పాటు హాల్టింగ్ కల్పించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం

తెనాలిరూరల్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అదృశ్యం కావడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు .. మండలంలోని పెదరావూరు గ్రామానికి చెందిన కొడాలి చంద్రకాంత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చిన అతను కనబడకుండా పోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద ఆదివారం 1716 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 100 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 239 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 180 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 80 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 600 క్యూసెక్కులు నీటిని వదిలారు.

సమగ్ర ప్రగతే లక్ష్యం

- అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధికి చర్యలు
- వ్యవసాయ రంగానికి పెద్దపీట
- వరికపూడిసెల ప్రాజెక్టు పూర్తికి ఏర్పాట్లు
- అందరికీ మెరుగైన విద్య, వైద్య సేవలు
- గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్



ప్రసంగిస్తున్న పి.అరుణ్‌బాబు

సాక్షి, నరసరావుపేట : ''జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. స్వర్ణాంధ్రలో భాగంగా 15 శాతం వృద్ధి సాధిస్తూ 2029 నాటికి రెండింతల ప్రగతి నమోదు చేసేలా ప్రణాళికల అమలుకు చర్యలు తీసుకుంటున్నాం. మహాత్ములు కలలుగన్న స్వాతంత్ర్యఫలాలు, రాజ్యాంగ స్ఫూర్తితో అందరికి సమాన అవకాశాలు కల్పిస్తున్నాం. జిల్లా ప్రజలందరికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు'' అని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం నరసరావుపేట రూరల్ మండలం లింగంగుంట్లలోని జిల్లా కలెక్టరేట్ వద్ద నూతనంగా అందుబాటులోకి తెచ్చిన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో ముఖ్యఅతిథిగా ఆయన ప్రసంగించారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్ర్యం సిద్ధించటానికి కృషి చేసిన సమరయోధుల సేవలను కొనియాడారు. అమర వీరులకు నివాళులు అర్పించారు. రాజ్యాంగం గొప్పతనాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లావ్యాప్తంగా 421 రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్నామని తెలిపారు. రైతులకు ఖరీఫ్‌లో రూ.3 కోట్లు, రబీలో రూ.58 లక్షల విలువైన విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేశామన్నారు. 65,143 మంది కౌలు రైతులకు కార్డులు అందజేసి, రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గోకులం పథకం ద్వారా 700 షెడ్లను నిర్మించామన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద జిల్లాలో రూ.805.27 కోట్లతో 44,737 ఇళ్లు మంజూరవ్వగా.. 15,360 ఇళ్లు పూర్తి అయ్యాయని చెప్పారు. జిల్లాలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 6.45 లక్షల కార్డుదారులకు ప్రతి నెలా బియ్యం, ఇతర సరకులను 1,290 చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. 115 కొనుగోలు కేంద్రాల ద్వారా 5,131 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు.

విద్య, వైద్యానికి పెద్దపీట...

జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 18 ప్రీ మెట్రిక్, 11 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో మొత్తం 3,397 మందికి వసతి కల్పిస్తున్నట్లు కలెక్టర్ గుర్తుచేశారు. రూ.3కోట్లతో 19 వసతి గృహాలకు మరమ్మతులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని 2,031 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. 39 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా 1,518 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,27,447 మందికి నిత్యం భోజనం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్‌టీఆర్ భరోసా పథకం ద్వారా జిల్లాలో 2,73,530 మందికి ప్రతినెలా ఒకటో తేదీన ఇంటి వద్దే పింఛన్ నగదు అందజేస్తున్నామని పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.509 కోట్లతో 1,055 పనులు మంజూరు కాగా, 297 పనులు పూర్తి అయ్యాయని చెప్పారు. మరో 233 పురోగతిలో ఉన్నాయన్నారు.

అభివృద్ధికి రాజమార్గం...

రాజుపాలెం నుంచి అమరావతి వరకు 45 కిలో మీటర్లు మేర రెండు లైన్ల రహదారిని అభివృద్ధి పరిచేందుకు రూ.143 కోట్ల నాబార్డు నిధులతో పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో రూ.4,735 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబోయే 4 భారీ పరిశ్రమల ద్వారా 4,300 మందికి ఉపాధి కల్పించేందుకు ప్రతిపాదించినట్లు చెప్పారు. 89,904 వ్యవసాయ పంపుసెట్లకు ఉచితంగా 9 గంటల విద్యుత్ అందజేస్తున్నామని తెలిపారు. చేతి వృత్తుల వారికి నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. నాగార్జున సాగర్, అనుపు ప్రాంతాన్ని స్వదేశీ దర్శన్ 2.0లో భాగంగా రూ.25 కోట్లతో అభివృద్ధి చేసేందుకు అంగీకారం లభించిదన్నారు. జిల్లాలో 10 అన్నా క్యాంటీన్ల ద్వారా నిత్యం 9 వేల మందికి ఉదయం అల్పాహారం , మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు మండల స్థాయిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 3,925 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. 3,346 అర్జీలను పరిష్కరించామని చెప్పారు. జిల్లాలో ప్రధాన మంత్రి నగరవనం స్కీం ద్వారా కోటప్పకొండ, వినుకొండ, మాచర్ల, దేవరంపాడు అటవీ ప్రాంతాలలో యోగశాల, పిల్లల పార్కులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఖనిజ నిధి ద్వారా రూ.46.38 కోట్లతో 289 పనులు పూర్తి చేశామని వెల్లడించారు. వరికపూడిసెల ప్రాజెక్టు పూర్తికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది కృషికి అభినందనలు తెలిపారు.



జెండా వందనం చేస్తున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు





సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థులు

ఘనతంత్ర వేడుకలు

అట్టహాసంగా రిపబ్లిక్ డే ఉత్సవాలు

- నూతన పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఆవిష్కరించిన కలెక్టర్
- వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్న విద్యార్థులు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 14 శాఖల శకటాలు, స్టాళ్లు
- అబ్బురపరిచిన పోలీసు జాగిలాలు, అగ్నిమాపక సిబ్బంది విన్యాసాలు
- ఉత్తమ సేవలు అందజేసిన పలువురు అధికారులకు అవార్డులు



ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు. చిత్రంలో ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా న్యాయమూర్తి సత్యశ్రీ

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఆదివారం రిపబ్లిక్ డే వేడుకలు కలెక్టరేట్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. పల్నాడు కలెక్టరేట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, ఇతర జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ పి.అరుణ్‌బాబు జాతీయ జెండా ఆవిష్కరించారు. జిల్లా 13వ అదనపు న్యాయమూర్తి సత్యశ్రీ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. జిల్లా డీఏఆర్, హోంగార్డు, మోటార్ వెహికల్ ట్రాన్స్‌పోర్టు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సాదినేని కృష్ణ సారథ్యంలో బ్యాండ్ మేళం మధ్య పోలీసులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్ విద్యార్థులచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జిల్లాలో గతేడాదిగా చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రసంగించారు. శ్రీలంక ఆపరేషన్‌లో పాల్గొని మృతి చెందిన భారత జవాను, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, బంధువులకు శాలువాలు కప్పి సత్కరించారు. వివిధ శాఖల ఉద్యోగులు జాతీయ జెండాలు చేబూని ప్రదర్శించిన 14 శకటాలు ఆకట్టుకున్నాయి. విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని శావల్యాపురం, నరసరావుపేట శంకరభారతీపురం జెడ్పీహైస్కూలు, సెయింట్ జోసెఫ్, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు రైడర్, వాఘా, కైరోలచే పోలీసులు విన్యాసాలు చేయించారు. రైడర్ పేరు గల లాబ్రాడర్ జాతికి చెందిన పోలీసు శునకం బొకేను తీసుకెళ్లి కలెక్టర్‌కు అందజేయటం విశేషం. బెల్జియం దేశానికి చెందిన పోలీసు జాగిలం ప్రదర్శించిన విన్యాసం అబ్బురపర్చింది. అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రమాదాల నివారణ విధానాలను ప్రదర్శించారు. అనంతరం పలు విభాగాల్లో ఉత్తమ సేవలు అందజేసిన జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు అవార్డులు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా సందర్శకులు, విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఆర్వో ఎ.మురళి, ఏఆర్, శాంతిభద్రతలు, అడ్మిన్ అదనపు ఎస్పీలు సత్తిరాజు, జేవీ సంతోష్, సీహెచ్ లక్ష్మీపతి పాల్గొన్నారు.



సమరయోధుల కుటుంబసభ్యులకు సన్మానం



విన్యాసాలు చేస్తున్న పోలీసు జాగిలం



ఆరోగ్యశాఖ శకటం ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

బైబిల్ మిషన్ మహోత్సవాలు ప్రారంభం



ప్రార్థనల్లో పాల్గొనేందుకు తరలివచ్చిన భక్తులు

పెదకాకాని: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట బైబిల్ మిషన్ మహోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు నాలుగురోజులపాటు జరగనున్నాయి. రాష్ట్ర నలుమూలలతోపాటు పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. తొలుత కాకాని స్వస్తిశాల సంగీత బృంద సభ్యులు ప్రత్యేక క్రైస్తవ భక్తి కీర్తనలు ఆలపించి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె శామ్యేల్ కిరణ్ వాక్యోపదేశం చేశారు. క్రీస్తు బోధనలను వివరించారు. బైబిల్ మిషన్ సెక్రటరీ రెవరెండ్ కె.ప్రశాంత్ కుమార్, రెవరెండ్ రాజు, రెవరెండ్ పి.ప్రకాష్ ఓనేసం, రెవరెండ్ సత్య ప్రకాష్, రెవరెండ్ డాక్టర్ డేనియల్ దినకర్‌లు దైవ సందేశాలు అందించారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, కేరళ, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మహోత్సవాల ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పెదకాకాని స్వస్తిశాలకు కూడా భక్తుల తాకిడి పెరిగింది. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. ఆహారం, తాగునీరు అందించారు. సుమారు 50 ఎకరాల్లో విశాలమైన పందిళ్లు ఏర్పాటు చేశారు. బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ జె. శామ్యేల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, జె.ఆగమన రావు, ఎం.సజీవరావు, గవర్నింగ్ బాడీ సభ్యులు సారథ్యంలో మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.



ప్రసంగిస్తున్న బైబిల్ మిషన్ అధ్యక్షులు, ఉత్సవ కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్ కిరణ్

నేటి షెడ్యూల్ వివరాలు...

బైబిల్‌మిషన్ మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండవరోజు సోమవారం తెల్లవారుజామున ధ్యానం, క్రైస్తవ కీర్తనల ఆలాపన ఉంటాయి. అనంతరం పాస్టర్లు దైవ సందేశాలు అందిస్తారు.

స్త్రీవాదంపై కొత్త కోణాలు అవసరం

- మేధావులతో సాహితీ వేదిక సదస్సు కళకళ
- ఆలోచింపజేసేలా లోతైన పరిశీలన ఉపన్యాసాలు
- అతివల భాగస్వామ్యంతోనే మేలని వక్తల అభిప్రాయం

యడ్లపాడు: నాటకం- సాహిత్యం ఒకేచోట సాక్షాత్కరించాయి. సాహిత్య అకాడమీ, వేదిక (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం) సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ అపురూప కార్యక్రమం జరిగింది. వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు శ్రీకారం చుట్టిన సదస్సుకు పల్నాడు జిల్లా యడ్లపాడు గ్రామం వేదికైంది. స్థానిక రచ్చబండ సెంటర్లో సురేష్‌కుమార్ నివాసంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమం సాహితీ బంధువులు, నాటకరంగ ప్రసిద్ధులు, సాహిత్య ప్రియులతో కళకళలాడింది. తెలుగు సాహితీ అభ్యున్నతికి కృషి చేస్తున్న అక్షరసేనాని, కళామతల్లికి సేవలు అందించిన, అందిస్తున్న రచయితలు, రంగస్థల నటులు, దర్శకులు, కళాపరిషత్‌ల నిర్వాహకులు, సాహితీ పరిశోధకులు, జన జాగృతికై పోరాడే సంస్కరణోద్యమకారులు కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. 'తెలుగు నాటకం-స్త్రీవాదం'పై మూడు దశల్లో జరిగిన ఈ సదస్సులో వక్తలు అద్భుతంగా వివరిస్తూ అందర్నీ ఆకట్టుకుంటూ ఆలోచింపజేశారు. ఒక గ్రామీణ ప్రాంతంలో ఇంత ప్రతిష్టాత్మకంగా జాతీయస్థాయిలో తెలుగు సాహితీ సదస్సు జరగడం బహుశ ఇదే మొదటిసారి కావచ్చని అతిథులు అభిప్రాయపడ్డారు.

మూడు దశలలో నిర్వహణ

మొదటి సదస్సుకు సురేష్‌బాబు అధ్యక్షత వహించగా, సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘం సభ్యులు వల్లూరి శివప్రసాద్ స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం స్త్రీవాద రచయిత్రి ఓల్గా కీలకోపన్యాసం, వేదిక కార్యదర్శి జేవీ మోహన్‌రావు వందన సమర్పణ చేశారు. రెండో సదస్సుకు అంబటి మురళీకృష్ణ అధ్యక్షత వహించగా, నాటకం-స్త్రీ చైతన్యంపై డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, పద్యనాటకం-స్త్రీ అభ్యుదయంపై నిభానుపూడి సుబ్బరాజు, సంస్కరణోద్యమ నాటకాలు-స్త్రీ చిత్రణపై సీహెచ్ సుశీలమ్మ ఉపన్యసించారు. మూడో సదస్సుకు పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షత వహించగా, ఆధునిక వీధినాటకం-స్త్రీ వికాసంపై పీవీ దేవి, నాటకం పురుషాధిక్యత-స్త్రీ ఆర్థిక స్వాతంత్ర్యంపై నల్లూరి రుక్మిణి, నాటకం-స్త్రీ వైవాహిక సమస్యల చిత్రణపై జె. కనకదుర్గ ప్రసంగించారు.



కీలకోపన్యాసం చేస్తున్న రచయిత్రి ఓల్గా

అర్థవంతమైన చర్చ

స్వాగతోపన్యాసం మొదలు వందన సమర్పణ వరకు పురాణ కాలం నుంచి నేటి యుగం వరకు పద్యం, సంస్కృతం, సాంఘిక నాటకాల్లో స్త్రీవాదం ఆవశ్యకత, ఆవిర్భావం, కాలానుగుణంగా రూపుదాల్చిన రచనలు, ప్రదర్శనల ప్రభావం, ఫలితంగా స్త్రీసమాజ చైతన్యంపై చర్చించారు. లింగవివక్ష, అంగాంగ వర్ణన, శ్రమదోపిడీ నుంచి విముక్తుల్ని చేసే కొత్త కోణాల్లో రచనలు ఆవిష్కృతం కావాలని వక్తలంతా ముక్తకంఠంగా నినదించారు. వక్తలు లోతైన పరిశీలన, పరిశోధన, పరిష్కారాలపై దృష్టి సారించడంతో అధ్యక్షత బాధ్యత వహించిన పెద్దలకు సమయపాలన నిర్వహణ కత్తిమీద సామే అయ్యింది. భాషాభిమానులు, సాహితీ, నాటకరంగ ప్రియులు, విద్యావేత్తలు, మహిళామణులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని ప్రసంగాలను ఆసక్తిగా ఆలకించారు. ముందుగా ముత్తవరపు లలితకుమారి, ఆలోకం పెద్దఅబ్బయ్య సభాపరిచయం చేయగా.. డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు సదస్సు నిర్వహణ ఉద్దేశాన్ని, కళలకు, సాహిత్యానికి ఈ ప్రాంతానికి ఉన్న సంబంధాన్ని వివరించారు. అతిథులను సాదరంగా సత్కరించి జ్ఞాపికలను అభినందించారు. ఈ సందర్భంగా రచయితలు కొందరు స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రానికి సాహిత్య గ్రంథాలను బహూకరించారు. చివరిగా తమ పరిశీలన, పరిశోధనాత్మక పత్రాలను వక్తలు సమర్పించడంతో సదస్సు విజయవంతంగా ముగిసింది. సహకరించిన అకాడమీ ప్రతినిధులు, హాజరైన అతిథులు, నాటకరంగ ప్రముఖులకు, ప్రజలకు సురేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు.



సదస్సుకు హాజరైన వారు



జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు నుంచి అవార్డు అందుకుంటున్న జిల్లా రెవెన్యూ అధికారి ఇ.మురళి



కె.మధులత, ఆర్డీవో, నరసరావుపేట; వి.మురళీకృష్ణ, ఆర్డీవో, గురజాల; జీవీ రమణకాంత్‌రెడ్డి, ఆర్డీవో, సత్తెనపల్లి; ఐ.మురళి, జిల్లా వ్యవసాయ అధికారి; ఎన్వీ శ్రీనివాసరావు, ఆర్టీసీ ప్రజారవాణా జిల్లా అధికారి; బాలునాయక్, డీఆర్డీఏ పీడీ; దుర్గాబాయ్, జిల్లా ఉపాధి అధికారి; ఎల్.చంద్రకళ, జిల్లా విద్యాశాఖ అధికారి; ఎం.నీలావతిదేవి, ఆర్జేడీ, ఇంటర్ విద్య; సీహెచ్‌వీ రమణారెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి; సీహెచ్ ఆంజనేయులు, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి



డాక్టర్ బి.రవి, డీఎంహెచ్‌ఓ; డాక్టర్ జీవీ రంగారావు, డీసీహెచ్‌ఎస్; వైసీ సుబ్బరాయుడు, ఎస్ఈ, పంచాయతీరాజ్; ఎంవీ భాస్కరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి; సీహెచ్ భానుకీర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేయర్; మణికంఠ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి; రాజానాయక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ; ఎం.హనుమంతురావు, డీఎస్పీ, సత్తెనపల్లి; జగదీష్, డీఎస్పీ, గురజాల; సురేష్, సీఐ, పెదకూరపాడు; ఎం. సంధ్యారాణి, సత్తెనపల్లి టౌన్

ఉత్తమ ఉద్యోగులకు పురస్కారాలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు అందజేశారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు చేతుల మీదుగా అధికారులు వీటిని స్వీకరించారు. జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఎఫ్‌వో కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు. – నరసరావుపేట రూరల్



కె.అమలకుమారి, జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి; బి.కోటేశ్వరరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, చిలకలూరిపేట; ఎస్.నాగేశ్వరరావు, ఎంఈవో, నరసరావుపేట; కె.వేణుగోపాల్‌రావు, నరసరావుపేట తహసీల్దార్; లీలా సంజీవకుమారి, తహసీల్దార్, కలెక్టరేట్; డానియేల్, తహసీల్దార్, పెదకూరపాడు; వి.సుబ్బరత్నమ్మ, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి; పి.ఆనందరావు, ఏఈ, విద్యుత్‌శాఖ, నరసరావుపేట; పి.పద్మారావు, ఏఎస్‌వో, డీఈవో కార్యాలయం; రాధిక, ఆఫీస్ సబార్డినేట్, ఐ అండ్ పీఆర్ కార్యాలయం; శ్రీనివాసరావు, డీఈవో కార్యాలయ సబార్డినేట్; శ్రీనివాసరావు, సర్వేయర్; బత్తుల వీరాస్వామి, మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్; అమృతలక్ష్మి, ఆర్అండ్‌బీ జేఈ



కిరణ్‌కుమార్, సీసీ కలెక్టర్; వెంకయ్య, ఆలయ ఈవో, చేజర్ల; కిరణ్, తహసీల్దార్, మాచర్ల; అనిల్‌కుమార్, గన్‌మెన్, కలెక్టర్; చంద్రబాబు, ఆఫీస్ సబార్డినేట్, కలెక్టర్ పేషి; ఎస్.శ్రీధర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, సత్తెనపల్లి; ఏపీ మధుకుమార్, జిల్లా మాజీ సైన్స్ ఆఫీసర్; గుండాల రాకేష్, సాహితీవేత్త; కేవీ కృష్ణకుమారి, ఎంపీడీవో, నరసరావుపేట; బీఆర్ గాంధీ, డీఎస్పీ, ఏఆర్; ఎస్‌బీ సీఐ బండారు సురేష్‌బాబు; చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐ అనిల్‌కుమార్; ఎస్‌బీ కానిస్టేబుల్ షేక్ సుభాని

నాట్కో ట్రస్టుకు కలెక్టర్ ప్రశంసాపత్రం



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రూ.50 కోట్లతో నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో క్యాన్సర్ నిర్మాణం చేసి కార్పొరేట్ క్యాన్సర్ వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్న నాట్కో ట్రస్ట్‌కు అవార్డు లభించింది. ఆదివారం గుంటూరులో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా నాట్కో ట్రస్ట్ వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, నాట్కో క్యాన్సర్ సెంటర్ కో–ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సదాశివరావు, అశోక్‌కుమార్‌లకు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్యాధికారులు, నాట్కో క్యాన్సర్ సెంటర్ సిబ్బంది, నాట్కో ట్రస్ట్ సభ్యులు అభినందనలు తెలిపారు.

వివా వీవీఐటీలో వేడుకలు

పెదకాకాని: వివా ది స్కూల్, వీవీఐటీలో ఆదివారం గణతంత్ర దిన వేడుకలను నిర్వహించారు. 25 ఆంధ్ర బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలలోని వీవీఐటీ, వివా ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. లెఫ్టినెంట్ కల్నల్ దీపక్ శర్మ మాట్లాడుతూ జాతీయ భావం గురించి వివరించారు. చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ వై.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు

కొత్త ఆలోచనలు ఎంతో అవసరం

- నవ్య నాటక రచనలు రావాలని ఆకాంక్ష
- తెలుగు నాటకం–స్త్రీవాదం సదస్సులో అభిప్రాయం వ్యక్తం చేసిన వక్తలు

యడ్లపాడు: స్త్రీవాదంపై నూతన ఆలోచనలతో నవ్య నాటక రచనలు రావాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. సాహిత్య అకాడమీ, వేదిక (తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం) సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు నాటకం–స్త్రీవాదం సదస్సు ఆదివారం నిర్వహించారు. వేదిక అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు శ్రీకారం చుట్టిన సదస్సుకు పల్నాడు జిల్లా యడ్లపాడు గ్రామం వేదికైంది. ఈ కార్యక్రమం భవిష్యత్ రచనలకు, సదస్సులకు స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ప్రసంగించారు.

స్త్రీ విలువను పెంచింది వీధినాటకాలే : దేవి



మాట్లాడుతున్న దేవి


వీధినాటకం.. వర్తమాన కాలానికి అద్దం వంటిది. స్త్రీల విలువల్ని ప్రస్ఫుటింపజేసినవి వీధి నాటికలే. సనాతన ముసుగును తొలగించి, స్త్రీ సమానత్వాన్ని చూపాయి. భ్రమ నుంచి వాస్తవంలోకి తెచ్చాయి. చరిత్రలో మానవులపై జరిగిన విధ్వంసాలన్నీ స్త్రీలపైనే మొదలయ్యాయని సమాజాన్ని సూటిగా ప్రశ్నించాయి. చరిత్ర పునర్నిర్మించే క్రమంలో స్త్రీ ప్రతి పాత్ర వంచనకు గురైంది.

సామాజిక మార్పునకు 'స్త్రీ'కారం చుట్టాలి : ఓల్గా



'కావ్యేషు నాటకం రమ్యం'అని పెద్దలు చెప్పినట్లు.. అన్నింటి కంటే గొప్పది నాటకం. ఆస్వాదించే, ప్రదర్శించే సమూహంతో కూడిన గొప్ప కళ. పరిషత్ నాటకాలు, ప్రయోగాత్మక నాటకాలు, సామాజిక సమస్యలపై చైతన్యం చేసే వీధి నాటకాలలో స్త్రీవాదాన్ని జొప్పించి, వారు కర్తలుగా, సామాజిక మార్పులకు కీలకమైన వారిగా గుర్తించి రచనలు చేయాలి. నేడు పర్యావరణం, హింసపై ప్రపంచ వ్యాప్తంగా జరిగే పరిశోధనలాగే స్త్రీవాదంపై లోతైన అధ్యయనం జరగాలి. అలాంటి మార్పు కలిగిన సాహిత్యం, నాటకాల కోసం నేడు ఆంధ్రులు నిరీక్షిస్తున్నారు. అణచివేత, హింస, వేధింపులు, దురాచారాలకు గురవుతున్న తరుణంలో ఆధునిక తెలుగు సాహిత్యం, ఆ తర్వాత నాటకం మొదలైంది. తెలుగు సాహిత్యంలో గురజాడ రచించిన కన్యాశుల్కంలోని మధురవాణికి మించిన పాత్ర నేటికీ రాలేదు. అది స్త్రీ ఔన్నత్యాన్ని, సాధికారితను, స్త్రీల చైతన్యాన్ని ఆవిష్కరించింది.

అక్కడి నుంచే వినిపించిన తొలి గళం : డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు



యుగయుగాన దోపిడీలో.. తరతరాల రాపిడిలో అణగదొక్కబడిన స్త్రీ తన స్థితి, పరిస్థితిపై చేసిన ఆలోచన.. ఎందరో సంఘ సంస్కర్తల కృషితో వెల్లివిరిసిన మహిళా చైతన్యంతో పుట్టిన గొప్పవాదం స్త్రీవాదం. 1879 నార్వేలో ఇప్సన్ రాసిన నాటక ప్రదర్శనలో తలుపు వేసిన 'ధడేల్'మనే శబ్దంతో తొలిగా స్త్రీవాదం ప్రతిధ్వనించింది. నాడు పురుష లోకం ఉలిక్కిపడింది. తొలిగా స్త్రీ పాత్ర ధరించిన సాంఘికనాటకం, స్త్రీవాదంతో రూపొందిన హేతువాద నాటకాలు, కొమ్మూరి పద్మావతి, చలం, ఇసుకపల్లి మోహన్‌రావు, గొల్లపూడి మారుతీరావు వంటి ఎందరో స్త్రీవాదంపై రాసిన రచనలు ఉదాహరణ. సంచలనాత్మక నాటకాలను చారిత్రక ఆధారాలతో ప్రదర్శితమయ్యాయి. భారతీయ భాషల్లో 50కి పైగా అద్భుత స్త్రీవాద నాటకాలు ఉన్నాయి.

కొత్త బాట చూపించిన పద్యనాటకాలు : నిభానుపూడి సుబ్బరాజు



తెలుగు సాహిత్య గనిలో, నేల మాగాణిలో లంకెబిందెల్లాంటి రచనలు పద్య నాటకాలు. బలిజేపల్లి లక్ష్మీకాంత్ రాసిన సత్యహరిశ్చంద్ర రచన ఆవశ్యం, చంద్రమతి పాత్రలు గమనించదగినవి. 1880లో తొలి సాంఘిక వచనం లేని పద్య నాటకం ఆవిర్భవించింది. నాటి జమీందారి వ్యవస్థలోనే స్త్రీవాదం వినిపించి కొత్తదారిని చూపింది.

నాలుగు దశాబ్దాల క్రితమే పునాది : వల్లూరి శివప్రసాద్



నాలుగు దశాబ్దాల కిందటే స్త్రీవాదం తెలుగు నాటకంలో ప్రవేశించింది. స్త్రీవాద దృక్పథంతో కవిత్వం, కథానిక, నవల, నాటకం రూపాల్లో సభలు, సదస్సులు, గోష్టులు, విమర్శలు విస్తృతంగా వచ్చాయి. పరిశోధనలు ఇతోధికంగా జరిగాయి. కానీ సాహిత్య విమర్శకులు, పరిశోధనకులు తెలుగు నాటకాన్ని పరిశీలించే ప్రయత్నం, అధ్యయనం చేయకపోవడం వెలితిగా ఉండేది. ఇలాంటి సదస్సుల నిర్వహణ ఆ వెలితిని భర్తీ చేసేందుకు దోహదపడుతుంది. మరిన్ని కార్యక్రమాలకు ఆదర్శంగా నిలుస్తాయి.

వేదిక స్త్రీవాద గీతిక కావాలి : అంబటి మురళీకృష్ణ



తెలుగు నాటకాల్లో స్త్రీలు బాధితులు, పీడితులు. ఆ స్త్రీలకు తమ శక్తిని వ్యక్తీకరించే రచనలు అవసరం. స్త్రీ పాత్రల్ని పురుషులు ధరిస్తున్నా, 1935లో స్త్రీలే వారి పాత్రల్ని వేయాలని నండూరి బంగారయ్య తన నాటకంతో ప్రబోధించారు. కవిత్వం, కథ, నవలలో అద్భుతంగా చిత్రించి, వారి వాణిని బలంగా వినిపించే తరుణం ఈ వేదిక కావాలి.

కన్యాశుల్కమే ప్రామాణికం : సీహెచ్ సుశీలమ్మ



స్త్రీల అణచివేత, తిరుగుబాటు, పురుషుల వంచన తదితరాలు ఎన్నో కీలకంగా ఉన్నాయి. దీనికి ప్రామాణికంగా గురజాడ కన్యాశుల్కం నాటకం పాత్రలన్నీ గమనించవచ్చు. అక్షరాన్ని పదునైన ఆయుధంగా మార్చేవే రచనలు. అలాంటి రచనే కన్యాశుల్కం.

ఔన్నత్యాన్ని చాటే రచనలు రావాలి : మృత్యుంజయరావు



ఏ వాదం గురించి చర్చ జరుగుతుందో దానికోసం ఆ వర్గం వారంతా సమష్టిగా కృషి చేయాలి. అప్పుడే ఫలితం లభిస్తుంది. స్త్రీవాద చర్చకు మహిళలు అధికంగా హాజరుకాకపోవడం బాధకరం. ఏ రంగాల్లో స్త్రీలు వెనుకబాటులో ఉన్నారో గుర్తించి వారిని ప్రోత్సహించేలా రచనలు, నాటకాలు రావాలి.

నాటి దృశ్యకావ్యమే నేటి నాటకం : నల్లూరి రుక్మిణి



ప్రాచీనకాలంలో సంజ్ఞల ద్వారా మొదలైన ఈ దృశ్య కావ్యం జానపదాలుగా .. తర్వాత లిఖిత సాహిత్యం వచ్చాక పండితులచే సాహిత్య నాటకంగా వర్ధిల్లుతోంది. సమాజంలో నెలకొన్న సమస్యల్ని నాటకాలుగా మలిచి వాటికి పరిష్కారం చూపారు.

వైవాహిక జీవనం బాల్యం నుంచే.. : జె. కనకదుర్గ



స్త్రీవాదం సామాజిక సిద్ధాంతం. వారి సమస్యల పరిష్కారం కోసం వెతుకుతూ వచ్చింది. స్త్రీలకు వైవాహిక సమస్య బాల్య వివాహాలతోనే మొదలవుతుంది. ఆధునిక కాలంలోనూ ఇది జీవం పోసుకుని ఉంది. ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం నేపథ్యంలో దీన్ని రూపొందించారు. స్వేచ్ఛ, క్రియా స్వేచ్ఛ, సమాన హక్కుల స్వేచ్ఛ, భావప్రకటన స్వేచ్ఛ సంపూర్ణంగా లభించినప్పుడే వైవాహిక జీవనం వెల్లివిరిస్తుంది.

కేంద్ర అవార్డు అందుకున్న సర్పంచ్



కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భఘేల్ నుంచి అవార్డు అందుకుంటున్న శివరామకృష్ణ

యడ్లపాడు: ఢిల్లీలో జరిగిన గణతంత్ర దిన వేడుకల్లో మండలానికి చెందిన మద్దినీడి శివరామకృష్ణ ఉత్తమ పంచాయతీ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. దివారం జరిగిన ఈ వేడుకల్లో కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ భఘేల్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ముద్దన నాగేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

గ్రామ ప్రథమ పౌరుడికి అందని ఆహ్వానం



అయ్యన్నపాలెం సచివాలయం వద్ద గణతంత్ర దిన వేడుకల్లో సచివాలయ సిబ్బంది

బొల్లాపల్లి : గణతంత్ర దినోత్సవాన గ్రామ ప్రథమ పౌరుడైన పంచాయతీ సర్పంచ్‌కి ఆహ్వానం అందలేదు. అయ్యన్నపాలెం గ్రామంలో సచివాలయం వద్ద ఆదివారం త్రివర్ణ పతాకం ఎగురవేశారు. సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో జెండా వందన సమర్పణ చేశారు. గ్రామ సర్పంచ్ పి. సాయిబాబుకు ఆహ్వానం లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందని పలువురు చర్చించుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ వెల్లడించారు.

త్యాగధనుల స్ఫూర్తి ఆదర్శం



పిరమిడ్ ఆకృతిలో భాష్యం విద్యార్థుల విన్యాసాలు

గుంటూరు ఎడ్యుకేషన్: త్యాగధనుల స్ఫూర్తి ఆదర్శమని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. ఆదివారం గణతంత్ర దినం సందర్భంగా చంద్రమౌళీనగర్‌లోని మెయిన్ క్యాంపస్ వద్ద పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే భాష్యం బ్లూమ్స్‌లో కాటూరి మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శిల్ప జెండా ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

హెడ్ కానిస్టేబుల్‌పై యువకుడి దాడి

పెదకూరపాడు: హెడ్ కానిస్టేబుల్‌పై మద్యం మత్తులో ఓ యువకుడు దాడి చేసిన సంఘటన పెదకూరపాడులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పెదకూరపాడు ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. పెదకూరపాడులోని పాత బస్టాండ్ సెంటర్‌లో అమరావతి ఎస్ఐ రాజశేఖర్ విధుల్లో ఉండగా అదే సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న పెదకూరపాడుకు చెందిన షేక్ రియాజ్ ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో ఆపారు. బండి కాగితాలు చూపించమని అడిగారు. రియాజ్ మద్యం మత్తులో కాగితాలు చూపించకపోవడంతో పెదకూరపాడు హెడ్ కానిస్టేబుల్ నంబూరు నాగేశ్వరరావును సదరు బైక్‌ను స్టేషన్‌లో పెట్టమని ఆదేశించి వెళ్లిపోయారు. వెంటనే నాగేశ్వరరావును రియాజ్ దుర్భాషలాడాడు. 'నా బైక్ తీసుకెళ్లే ధైర్యం ఉందా?' అంటూ ఒక్కసారిగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో నాగేశ్వరరావుకు గాయాలయ్యాయి. పక్కన ఉన్న హోంగార్డు బైక్ తాళం చెవి తీసుకోని హల్‌చల్ చేశాడు. హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిబాబు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

తెనాలిరూరల్: స్థానిక యడ్ల లింగయ్య కాలనీలోని మురుగు కాల్వలో ఆదివారం ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. కాలనీకి చెందిన కరీం బాషా(29) అలియాస్ జండు మురుగు కాలువలో మృతి చెంది పడి ఉండటాన్ని తెల్లవారుజామున గుర్తించిన స్థానికులు మృతదేహాన్ని వెలికి తీయించారు. చిన్న మురుగు కాలువలో యువకుడు కరీం బాషా పడి ఉండటం అనుమానాలకు తావిస్తోంది. స్థానికులు తెనాలి త్రీ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. చెంచుపేటలోని ఓ హోటల్లో మృతుడు పని చేస్తుంటాడని అతని తల్లి, మేనమామ తెలిపారు. హోటల్ నిర్వాహకులు తరచూ తీసుకెళ్తూ ఉంటారని, శనివారం సాయంత్రం పిండి కలిపే పని ఉందని చెప్పి తీసుకువెళ్లారని వివరించారు. అయితే రాత్రి ఇంటికి రాలేదని స్నేహితుల ఇంట్లో ఉండి ఉంటాడని భావించామని చెప్పారు.

బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య
- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల ర్యాలీ
- నరేంద్ర మోదీ నియంత పాలనపై పోరాడి మెడలు వంచాలి
- వ్యవసాయ సంక్షోభంతో అందరికీ నష్టం



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం, సీపీఐ, రైతు సంఘాల నాయకులు

నరసరావుపేట: దేశంలో వ్యవసాయ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా జాతీయ అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆదివారం పట్టణంలో మార్కెట్ యార్డ్ నుంచి మల్లమ్మ సెంటర్ మీదుగా స్టేషన్ రోడ్డులోని గాంధీపార్క్ వరకు ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీపార్క్ వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో కృష్ణయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలపాటు రైతులు, కార్మికుల పోరాటానికి దిగివచ్చి క్షమాపణ చెప్పి చట్టాలు వెనక్కి తీసుకుంటామని హామీ ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేడు దొడ్డిదారిన అవే చట్టాలను అమలు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనివల్ల వ్యవసాయంపై ఆధారపడ్డ రైతుల పరిస్థితి ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భారతదేశంలో రైతులు ఆత్మహత్యలు పెరుగుతున్నాయని దీనికి పాలక పక్షాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం మీద ఆధారపడే రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు సంక్షోభంలో ఉంటే వ్యవసాయాన్ని ఆధారం చేసుకుని అనుబంధ వ్యాపారాలు చేస్తున్న వాళ్ల లాభాల్లో ఉన్నారన్నారు. దేశంలో ఏటా వేల సంఖ్యలో వాటిల్లుతున్న రైతు ఆత్మహత్యలు పాలకులు చేస్తున్న హత్యలని స్పష్టం చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రధాని అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేద, ఇప్పటికైనా రైతుల పంటలకు డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులు ప్రకారం గిట్టుబాటు ధరలు చట్టం చేయాలని, కేరళ తరహా రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే కాలంలో రైతులు, కార్మికులు ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించి ప్రభుత్వాలకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రెడ్ బాషా, కార్మిక సంఘాల నాయకులు ఎస్.ఆంజనేయనాయక్, కాసా రాంబాబు, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, కిసాన్ మహాసభ నాయకులు తోట ఆంజనేయులు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు కె.ఏడుకొండలు, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, షేక్ హుస్సేన్, సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్, ఏ.మారుతి వరప్రసాద్, నాయకులు హనుమంతరెడ్డి, షేక్ సిలార్ మసూద్, మల్లీశ్వరి, వైదన వెంకట్, సైదా రంగయ్య పాల్గొన్నారు.